క్లుప్తంగా

రోడ్డు పక్కన చెట్ల తొలగింపు



జేసీబీతో గుబురు చెట్లను తొలగిస్తున్న సీఐ సోమశేఖర్

కొండపి: రోడ్డుకి ఇరువైపులా గుబురుగా పెరిగిన చెట్లు, కొమ్మలు, ముళ్లచెట్లతో ప్రమాదాలు జరగకుండా పోలీసులు తొలగించారు. మంగళవారం కొండపి నుంచి పెరిదేపి గ్రామానికి వెళ్లే దారిలో రంగసాయి వాగు సమీపంలో సీఐ సోమశేఖర్, ఎస్సై ప్రేమ్ కుమార్ జేసీబీని తెప్పించి తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాల సంభవించకుండా రోడ్డుకి ఇరువైపోలా పెరిగిన చెట్లను తొలగించామన్నారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనం నడుపు సమయంలో ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ట్రాక్టర్‌లో ప్రయాణం చేసే సందర్భంలో డోర్లు ఓపెన్ చేయరాదని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్కిల్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ షెడ్ యాత్రకు సర్వం సిద్ధం



సమావేశం జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పీడీ జోసెఫ్‌కుమార్

పీసీపల్లి: వర్చువల్‌గా ప్రారంభించనున్న వాటర్ యాత్ర కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశామని పీడీ జోసఫ్ కుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని జంగాలపల్లి గ్రామంలో ప్రారంభం కానున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి అధికారులు కార్యక్రమానికి వస్తున్నారన్నారు. ఆయన వెంట అడిషనల్ పీడీ వందర్‌మాన్, ఎంపీడీవో ప్రభాకర్ శర్మ సిబ్బంది ఉన్నారు

రైతు కుటుంబానికి సాయం



సాయాన్ని అందజేస్తున్న పొగాకు బోర్డు అధికారులు

కనిగిరిరూరల్: మృతి చెందిన పొగాకు రైతుకు అధికారులు ఆర్థిక సాయం అందించారు. పట్టణంలోని మాచవరంలో మృతి చెందిన పొగాకు రైతు వంటిపెంట వెంకటేశ్వర్లు కుటుంబానికి పొగాకు బోర్డు అధికారులు తక్షణ సాయంగా రూ.20 వేలు నగదును మంగళవారం అందజేశారు. పొగాకు రైతు వెంకటేశ్వర్లు సాగుదారుల సంక్షేమ నిధి (గ్రోయర్ వెల్ఫేర్ ఫండ్) బీమాలో నమోదై ఉన్నందున సాధారణ మృతి కింద రూ. 50 వేలు ఇస్తారని బోర్డు అధికారులు తెలిపారు. అందులో భాగంగా మట్టి ఖర్చులకు తొలుత అందజేశారు. కార్యక్రమంలో టుబాకో యార్డ్ వేలం నిర్వాహణ అధికారి బీ కోటేశ్వరరావు, ఇన్‌చార్జి అధికారి రోహిత్ రాజ్, ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్కే షారుఖ్ తదితరులు ఉన్నారు.

చేతిరాత మార్చుకో.. భవిత గీత రాసుకో



దస్తూరిపై ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు



తర్ఫీదు ఇస్తున్న ఉపాధ్యాయుడు కోటిరత్నం

- చేతి రాత బాగుంటే విద్యార్థులకు మార్కుల మోత
- చక్కని దస్తూరితో మరిన్ని మార్కులు
- విద్యార్థులకు ఉపాధ్యాయుల సూచన

కనిగిరిరూరల్:

ముత్యాల్లాంటి అక్షర దస్తూరి ఆకర్షణతో విద్యార్థులకు పరీక్షల్లో మార్కులు పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. చేతిరాత బాగుంటే మన చుట్టు ఉన్న వాళ్లు కూడా మనల్ని ప్రత్యేకంగా గుర్తిస్తారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల ధ్యాస అంతా చదువుపైనే ఉంటుంది. కొద్ది మంది మాత్రమే చేతి రాతపై దృష్టి పెడతారు. అయితే చదువుతో పాటు చేతి రాతపై దృష్టి పెడితే పరీక్షల్లో మార్కులు మరి కొంత పెరిగే అవకాశం మెండుగా ఉంటుందని ఉపాధ్యాయులు చెప్తున్నారు. పరీక్షల్లో పశ్నపత్రావళీలోని ప్రశ్నలకు సమాధానం ఉన్నది ఉన్నట్లు రాసినా దస్తూరిపై ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. పేపరు మూల్యాంకనం చేసే వ్యక్తికి రాత అర్థమైతే మార్కులు మరికొంత పెంచి వేసే అవకాశం లేకపోలేదు. ఏడాది పాటు చదివిన విద్యార్థులు రెండున్నర గంటల్లో జవాబు పత్రాన్ని పూర్తిచేయాలి. దీంతో సహజంగా ఆందోళనలో ఎక్కువ మంది విద్యార్థులు ఉంటారు. కొందరు మొదటి ప్రశ్నకు సమాధానం చక్కగా రాసి మిగతా ప్రశ్నలకు వేగంలో సరిగా రాయలేక పోతుంటారు. అలాంటి సమయంలో రోజులో కొంత సమయాన్ని చదువుతో పాటు దస్తూరిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చేతిరాత బాగుంటే మార్కులు వస్తాయి..



పేజీలో వాక్యాలు పైనుంచి కిందకు లేదా పైకి ఉండకుండా వరుస క్రమంలో ఉండాలి. చేతి రాత బాగుంటే పేపరు దిద్దేవారికి ఆసక్తి పెరుగుతుంది. విద్యార్థులు దీనిపై దృష్టిసారించాలి. రాత బాగుంటే విద్యార్థులు కూడా క్రమశిక్షణగా ఉంటారని అర్థం వస్తుంది.

– జీ సంజీవి, హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, కనిగిరి

పరీక్షల్లో తీసుకోవాల్సిన మెళకువలు, జాగ్రత్తలు..

- సమాధాన పత్రంలో రాసే జవాబు సూటిగా ఉండటంతో పాటు, అక్షరాలు పొందికగా ఉంటే పేపరు దిద్దేవారికి ఆసక్తిగా ఉంటుంది.
- పేజీ పైభాగంలోను, ఎడమ వైపు ఒక అంగుళం మార్జిన్ వదిలిపెట్టాలి.
- పేజీకి 16 నుంచి 20 లైన్లు మించి రాయకూడదు.
- పెన్ను సక్రమంగా పట్టుకుని రాస్తే రాసే అక్షరాలు అందంగా గుండ్రంగా ఉంటాయి.
- అక్షరాలు, పదాలు వాక్యాలు మధ్య తగినంత ఖాళీ ఉండాలి.
- సామాన్య, భౌతిక శాస్త్రల్లో బొమ్మలు గీసీ భాగాలు గుర్తించే విషయంలో పెన్ను వత్తిడిపెట్టి రాయకూడదు. దీని వల్ల పేపర్ వెనుకభాగం చిందరవందరగా ఉంటుంది..

సూపర్ సిక్స్ అమలు చేయకపోతే ఓటమే



మస్తానయ్య స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పామూరు: రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను తక్షణం అమలుచేయాలని లేకపోతే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నేపల్లి లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలో దివంగత కామ్రేడ్ నీరుకట్టు మస్తానయ్య వర్థంతి కార్యక్రమం మంగళవారం స్థానిక గుజ్జుల యల్లమందారెడ్డి భవన్‌లో పార్టీ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా స్థానిక కందుకూరు రోడ్డులోని మస్తానయ్య స్మారకస్థూపం వద్ద పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నారాయణ మాట్లాడుతూ మస్తానయ్యను ఆదర్శంగా తీసుకుని నేటి నాయకులు పేదల సంక్షేమం కోసం పనిచేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతవిద్వేషాలను రెచ్చగొడుతోందన్నారు. నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లను పగులగొట్టండి, తగులబెట్టండి అన్న మంత్రి నారా లోకేష్ నేడు స్మార్ట్ మీటర్లను ఎందుకు వ్యతిరేకించడం లేదన్నారు. కూటమి పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారుతోందని ఇది ఆందోళనకర అంశమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి, ఆకుల మోహన్‌రావు, వజ్రాల సుబ్బారావు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్యపదార్థాలతో పొగాకు రైతుకు నష్టం



క్యూరింగ్ జరిగిన పొగాకును పరిశీలిస్తున్న అధికారులు

పొన్నలూరు: పొగాకులోని అన్య పదార్థాలను క్షేత్ర స్థాయిలోనే గుర్తించి రైతులు వాటిని తొలగించాలని పొగాకు బోర్డు కార్యదర్శి దివి వేణుగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని ముప్పాళ్ల, శింగరబొట్లపాలెం గ్రామాల్లో మంగళవారం ఆకు రెల్పు, క్యూరింగ్, గ్రేడింగ్ విధానాలపై పొగాకు రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్వానికి వచ్చిన ఆకులను మాత్రమే కొట్టాలన్నారు. బ్యారన్‌లో సరిపడిన పొగాకు కర్రలను లోడు చేయడం వలన నాణ్యమైన పొగాకు దిగుబడి అవుతుందన్నారు. గ్రేడింగ్ సమయంలో బుట్టలను అందుబాటులో ఉంచి అన్య పదార్థాలను వాటిలో వేయాలన్నారు. పొగాకు క్యూరింగ్ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తేలిక నేలల ప్రాంతీయ అధికారి ఎం లక్ష్మణ్‌రావు, వేలం నిర్వాహణాధికారి కిరణ్, బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కందులకు మద్దతు ధర రూ.7550



అంకేపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో వెంకటేష్

మద్దిపూడి: రైతులు పండించిన కంది పంటకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా రూ.7550 మద్దతు ధర కల్పిస్తుందని వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ పేర్కొన్నారు. మండలంలోని అంకేపల్లి, సన్నమూరు గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కందులు కొనుగోలు చేస్తారన్నారు. కందులు పండించిన రైతులు ముందుగా సంబంధిత రైతుసేవా కేంద్రాల్లో సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న అనంతరమే మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలు చేస్తారన్నారు. పంచాయతీ కార్యదర్శి డేవిడ్, విస్తరణాధికారి కోటేశ్వరరావు, వీపీఏలు చిన్నబాబు, మాజీ సర్పంచ్ బలరామిరెడ్డి, కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

బాధ్యతలు గుర్తెరిగి పనిచేయాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

వెలిగండ్ల (కనిగిరిరూరల్): సచివాలయ సిబ్బంది ప్రజలకు జవాబుదారితనంగా వ్యహరించాలని ఎంపీడీఓ ఎస్కే మహబూబ్ బాషా అన్నారు. మండలంలోని హుస్సేన్‌పురం, మొగళ్లూరు, సచివాలయాలను మంగళవారం అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది విధి నిర్వాహణలో బాధ్యతగా ఉండాలన్నారు. సమస్యలపై వచ్చిన అర్జీదారులతో బాధ్యతయుతంగా, గౌరవప్రదంగా వ్యహరించాలని సూచించారు. అనంతరం రికార్డులను, రిజిస్టర్‌లను పరిశీలించారు.

సదరం క్యాంపులో లబ్ధిదారుల కష్టాలు



పెన్షన్‌దారుల సదరం సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న డాక్టర్ కిరణ్



మండుటెండలో ఆటోలో వస్తున్న వృద్ధురాలు

కొండపి: గత ప్రభుత్వంలో సదరం సర్టిఫికెట్ల ఆధారంగా పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారులకు సదరం పునఃపరిశీలన శిబిరాన్ని కొండపిలోని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ప్రారంభించారు. జరుగుమల్లి, కొండపి, మద్దిపూడి మండలాల దివ్యాంగులకు కొండపి హెల్త్ కమ్యూనిటీ సెంటర్‌లో వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు కొండపి ఎంపీడీవో రామాంజనేయులు తెలిపారు. శిబిరంలో రోజుకు 50 మందిని పరీక్షిస్తున్నట్లు డాక్టర్ వరలక్ష్మి తెలిపారు. మొదటి రోజు జరుగుమల్లి మండలం కామేపల్లి, పచ్చవ, వర్ధినేనివారిపాలెం గ్రామాలకు చెందిన పెన్షన్ దారులు వెరిఫికేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు.

ఇబ్బందిపడిన పెన్షన్‌దారులు..

పెన్షన్‌దారులు వెరిఫికేషన్‌లో పాల్గొనడానికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. జరుగుమల్లి మండలం నుంచి కొండపికి రావడానికి దాదాపు 25 కిలో మీటర్ల దూరం ఉంటుంది. వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో, తమ సొంత వాహనాలు, ఆటోలలో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వచ్చారు. ఆటోలు బాడుగా కోసం సుమారు రూ.1000 ఖర్చు చేశామని వారితో వచ్చిన సహాయకులు తెలిపారు. వెరిఫికేషన్ ప్రక్రియ 10 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా గంట ఆలస్యంగా 11 గంటలకు ప్రారంభమైంది.

శ్రేష్టమైన దాణాతో అధిక పాల ఉత్పత్తి

మద్దిపూడి: ఆవులకు శ్రేష్టమైన దాణా అందించడం వల్ల పాల ఉత్పత్తి అధికంగా పెంచవచ్చని పశువైద్యాధికారి బ్రహ్మయ్య తెలిపారు. మంగళవారం మండల కేంద్రం మద్దిపూడి కొండ పాలంలోని సూరే నరసింహాకు చెందిన ఆవుల ఫారాన్ని ఆయన పరిశీలించిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవుల ప్రదేశంలో ఎప్పటికప్పుడు నీటితో శుభ్రపరచాలని సూచించారు. ఎలాంటి గర్భకోశ వ్యాధులు, ఎదకు రాకపోయిన, వచ్చినా, జబ్బు చేసినా స్థానిక వైద్యశాలలోని సిబ్బందిని సంప్రదించాలన్నారు.

శనగ పంటలో తెగుళ్ల నివారణ

టంగుటూరు: శనగ పంటలో తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారిణి స్వర్ణలత అన్నారు. మండలంలోని జయవరం, తూర్పునాయుడుపాలెం గ్రామాల్లో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖలతో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ 2024–25 పంట కాలానికి రైతు తాము సాగు చేస్తున్న పంటలను ఈ-క్రాప్‌లో వీపీఏల వద్ద నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీపీఏలు ప్రావీణ్య, పశు సంవర్ధక శాఖ సహాయకులు లక్ష్మీనారాయణ, విస్తరణ అధికారులు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు క్యాన్సర్ పరీక్షలు చేసుకోవాలి

హనుమంతునిపాడు: ప్రతి ఒక్కరూ ముందస్తు క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు దార్ల సందీప్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మండలంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతి పౌరుడికి ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారని, చేయించుకోవడానికి సంకోచించవద్దన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కేవీ చెన్నయ్య, ఆరోగ్య శాఖ సూపర్ వైజర్లు, ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని నల్లమడుగుల జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బుడాల డేవిడ్, ఎంపీపీఎస్ హెచ్ఎం అహ్మద్‌లు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ ఆశాజ్యోతి ఆధ్వర్యంలో నల్లమడుగులలో ర్యాలీ నిర్వహించారు.

సింగరాయకొండ: మండల కేంద్రం సింగరాయకొండలో వైద్యధాకారి ధీరేందర్ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ చైతన్యకృష్ణ, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌అలీ, విజయమ్మ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలుగునిచ్చే సూర్య భగవానుడా నమోస్తుతే !



కనిగిరిలో స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



కనిగిరిలో గ్రామోత్సవంలో కోలాట ప్రదర్శన చేస్తున్న భక్తులు

- భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు

సీఎస్‌పురం (పామూరు)/కనిగిరిరూరల్/పామూరు: భూమిపై సకల జీవరాశులు సంతోషంగా ఉన్నాయంటే అందుకు కారణం సూర్యుడే. ఈ కారణంగానే భానుడిని కనిపించే దేవుడు అంటారు. హిందూ సంప్రదాయం ప్రకారం సూర్యారాధనకు ఎంతో విశిష్టత ఉంది. ముఖ్యంగా భక్తులు సూర్య జయంతిరోజు ఎక్కువగా పూజిస్తారు. మాఘశుద్ధ సప్తమి, రథ సప్తమి (సూర్యజయంతి) వేడుకలు మండల కేంద్రమైన సీఎస్‌పురంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయంలో నారాయణస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి స్వామివారి ఉత్సవ మూర్తులకు అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ విశిష్టపూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వార్ల ఉత్సవమూర్తులకు ఆలయంలో రథోత్సవం మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని అయ్యలూరివారిపల్లె తిరుమలనాథస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి వారి మూల విగ్రహమూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పామూరులోని మదన వేణుగోపాలస్వామి ఆలయంలో ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు నిర్వహించగా అర్చకులు సత్యబాబుస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు కేవీ రమణయ్య, బండ్లా నారాయణ, హనుమంతు, మెంటా నరసింహారావు, భక్తులు పాల్గొన్నారు.

పట్టణ పురవీధుల్లో సప్తవాహన గ్రామోత్సవం

కనిగిరిరూరల్: రథ సప్తమి వేడుకలను కనిగిరిలో భక్తిశ్రద్ధలతో చేశారు. స్థానిక గార్లపేట రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి సూర్య ప్రభ వాహనం, చిన్న శేష వాహనం, పెద్ద శేష వాహనం, కల్ప వృక్ష వాహనం, హనుమంతు వాహనం, గరుడ వాహనం, చంద్ర ప్రభ వాహనాల్లో స్వామి వార్ల గ్రామోత్సవ వేడుకలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశిష్ట పూజలు చేశారు. ఆలయ కమిటీ పర్యవేక్షణలో కోలాట, భజనల ప్రదర్శనలు కోలాహలంగా జరిగాయి. డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ పర్యవేక్షణలో సీఐ ఎస్కే ఖాజావలి ఆధ్వర్యంలో ఎస్సై మాధవరావు పోలీసు బందోబస్తు నిర్వహించారు. ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గోనుగుంట గోపాల కృష్ణ మూర్తి, కొప్పరపు సత్యాలు, కమిటీ నాయకులు నార్లపాటి సాంబ శివరావు, రత్నా రెడ్డి, తిరుపతి రెడ్డి, చంద్ర, వాగిచర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మిట్టపాలెంలో ఉత్సవమూర్తులకు రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



పామూరులో వేణుగోపాలస్వామివారికి ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రూ.1 లక్ష విరాళం అందించిన పల్నాటి భాస్కర్‌రెడ్డి

రథసప్తమి సందర్భంగా వాహనాల పూల అలంకరణలకు వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పల్నాటి భాస్కర్‌రెడ్డి రూ 50 వేలు, పల్నాటి తిరుపతిరెడ్డి రూ.50 వేలు విరాళాలను ఆలయ కమిటీకి అందచేశారు. అనంతరం పల్నాటి భాస్కర్‌రెడ్డి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ దాతలను సన్మానించారు.

ఆగిన రిజిస్ట్రేషన్ల పునరుద్ధరణకు కృషి



సర్వే నంబరు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ వరకుమార్

సింగరాయకొండ: సాంకేతిక కారణాల వలన రిజిస్ట్రేషన్లు ఆగాయని వాటి పునరుద్ధరణకు కృషి చేస్తానని డిప్యూటీ కలెక్టర్ వరకుమార్ తెలిపారు. మండలంలోని మూలగుంటపాడు పంచాయతీలోని 108-3 సర్వే నంబరులో రిజిస్ట్రేషన్లు ఆగడాన్ని గ్రామస్తులు ఒంగోలులో మీకోసం లో ఇచ్చిన అర్జీపై మంగళవారం ఆయన విచారణ నిర్వహించారు. ఈసందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో రీ సర్వే జరిగిన సమయంలో ఎల్పీఎం నంబర్ 860లో 20 సర్వే నంబర్‌లు అధికారులు చేర్చారని, ఈ క్రమంలో 108-3 సర్వే నంబర్‌లోని 213.60 ఎకరాలు కూడా చేర్చారన్నారు. ఇక్కడ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఉండటంతో ఈ ఎల్పీఎం నంబరులో రిజిస్ట్రేషన్ నిలిచాయన్నారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు విచారణ జరిపామని, త్వరలో రిజిస్ట్రేషన్‌లు జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. తహశీల్దార్ టి రవి, సర్వేయర్ బ్రహ్మం, ఆర్ఐ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రెల్పు, క్యూరింగ్‌పై అవగాహన

- గుంటూరు పొగాకు బోర్డు ఆక్షన్ మేనేజర్ వేణుగోపాల్

కొండపి: పొగాకును రెలిచేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటే మంచి రేటు పొందవచ్చని గుంటూరు పొగాకు బోర్డు ఆక్షన్ మేనేజర్, ఇన్‌చార్జి సెక్రటరీ వేణుగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పొగాకు రెల్పు పద్ధతి, క్యూరింగ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంటూరు పొగాకు బోర్డు ఆక్షన్ మేనేజర్, ఒంగోలు ప్రాంతీయ కార్యాలయం రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ఆకు రెలిచేటప్పుడు మొక్క కింది భాగంలోని ఆకులో గడ్డి, కలుపు మొక్కలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పచ్చి ఆకు రవాణా చేసేందుకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆకును గ్రేడ్‌చేసే పద్ధతి, పచ్చి ఆకును కర్రలకు అల్లే పద్ధతితో రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ముందుగా కొండపి పొగాకు బోర్డు కార్యాలయాన్ని సందర్శించి క్షేత్రస్థాయి సిబ్బందితో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాబోయే మార్కెట్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కొండపి వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్, బోర్డు మెంబర్ బొడ్డపాటి బ్రహ్మయ్య, మోతిలాల్, బోర్డు క్షేత్రస్థాయి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.